
## ఈవారం కథ

# గోడమీది అక్షరాలు



**"అయ్యా... నాను బడికెల్లనే... పలక నేకుండా బడికెల్తే ఆడ్న మాట్టారు తంతున్నడు... ఎల్ల నంటే ఈడ్న నువ్వు తంతున్నవు.. నన్నొగ్గొయ్యవే అయ్యా..."**

— ఎన్.కె. నాగేశ్వరరావు

పెద్దగా శోకండాలు పెడుతూ అయ్యను బ్రతిమలాడుకుంటువ్నాడు మారేశు.

వాడికి ఆరేళ్ళుంటాయేమో. నల్లగా తారు డబ్బా రంగులో వున్నాడు. చింపిరి జుట్టు... దానికి తైల సంస్కారం చేసి చాలా రోజులయ్యిందేమో, అది రాగి రంగులోకి చేరిపోయింది. వొంటిమీద చినిగిపోయిన చొక్కా, నిక్కరూ. వాటిలో ఏ ఒక్కదానికీ బొత్తాలు లేవు. నిక్కర్ని మొలత్రాడుకు దోపుకొని, చొక్కాని అలాగే వదిలేశాడు. దాని చెంగులు గాలికి ఎగురుతువ్నాయి.

"ఏరా... నీ కెన్ని సుట్లు పలక కొనాల్రా ఎదవనా కొడకా! మొన్న కొన్న బంగార్నాటి పలక నీ ఎదాన్న కొట్టుకొని ముక్కలు సేసేసినావు కదరా దొంగవంజికొడకా..." బూతులు తిడుతూ, అలాగే బాదుతువ్నాడు మారేశు వీపు మీద వాడి అయ్య.

నిజానికి మారేశుగాడి పలక పగిలిపోయి ఆర్నెల్లు పైనే అయింది.

వాడిని బడిలో వేసినప్పడే వాడయ్య పలకా, బలపం రెండూ కొన్నాడు. అయితే, వాటిని రెండు రోజులు తిరక్కుండానే పగలగొట్టేశాడు మారేశు.

పలకనైతే వాడసలు పగలగొట్టాలని పనిగట్టుకు పగలగొట్టలేదు. బళ్ళో తన ప్రక్కన కూర్చున్న కుర్రాడు వాడి పలక కంటే మారేశుగాడి పలక కొత్తగా... అందంగా మెరిసిపోతుండడం చూసి మారేశు బడిలో చేరిన రెండో రోజున 'దాన్నొక్క పాలి ఇయ్యరా మారేశూ!' అని అడిగాడు.

"అమ్మో! ఇది నాది... నానియ్యను" డబ్బు మూటను దాచుకున్నట్టు ఆ పలకను రెండు చేతుల్తో గుండెలకు హత్తుకుంటూ అన్నాడు మారేశు.

"ఒక్కపాలంటే ఒక్క పాలేరా! సూసిత్తానంటే పేద్ద నీ దగ్గరే మానావు పలకున్నట్టు ఏందిరా గీరపోతున్నావు..." మారేశు దాచుకోబోయిన పలకను పట్టుకుని గుంజుకోబోయాడు బలవంతంగా వాడు.

వాడికి పలక చిక్కనివ్వకుండా మారేశు ప్రయత్నించడం... ఇద్దరూ అటూ, ఇటూ దాని కోసం పెనుగులాడ్డంతో అది కాస్తా మారేశు చేతుల్లోంచి జారి ముక్కలయ్యింది కిందపడి.

జరిగిందానికి మారేశులో ఏడుపు తన్నుకొచ్చింది. వాడు పెద్దగా ఏడ్వడం ప్రారంభించాడు. దాంతో పలక పగిలిపోవడంలో తన పాత్ర ఏమీలేనట్టు మిన్నకుండిపోయాడు రెండోవాడు.

ఇదంతా కనురెప్పపాటులో తన కళ్ళముందే జరగడంతో మాష్టారు ఇద్దరికీ చెరో నాలుగు తగిలించి ఊరుకున్నారు. అంతే తప్ప, పగిలిపోయిన మారేశుగాడి పలకను మళ్ళీ అతికి కొత్త పలక చేయలేకపోయాడాయన.

ఆయనేం చేస్తాడు? మాష్టారేమన్నా మాయలఫకీరా ! ఏమిటి?... ఎవరైనా పుస్తకాలు చింపేసు

కున్నా, పారేసుకున్నా బడిలోకి అసలంటూ రాని పిల్లలకు ఇవ్వాల్సి వున్న మిగిలిపోయిన పుస్తకాలను వీళ్ళకు ఇవ్వగలడుగానీ, బడిలో లేని పలకల్ని ఎలా సృష్టించి ఇవ్వగలడు?

అదిగో... అలాగ మారేశుగాడు పలక పగిలి పోయాక, ఆ పగిలిన పలకలోని పెద్దగా వున్న ముక్కను వెంట తీసుకొని కొన్ని రోజులు బడి కెళ్ళాడు. ఇవ్వాడేమో అది కూడా పగిలిపోయింది. అందుకే వాడి అయ్య గొడ్డును బాదినట్టు తనని బాదుతున్నా దెబ్బల్ని భరిస్తున్నాడు తప్ప 'బడికెళ్ళ నంటే ఎళ్ళనంతే' అంటున్నాడు మొండికెత్తిపోతూ.

మారేశు అలా మొండికెత్తడానికీ కారణముంది.

మొన్న ఎంకట్రావుగాడూ, సివాద్రిగాడూ ఇద్దరూ పలకల్లేకుండా బడికొచ్చారని మాష్టారు వాళ్ళిద్దరి వీపులూ దుళ్ళగొట్టేశారు.

'చేతిలో పలక కూడా లేకుండా బళ్ళోకొచ్చి ఎలా దిద్దుతార్రా అక్షరాలు... మీరు నా ప్రాణాలు తీయడం తప్ప...'' అని ఆయన కేకలేశారు.

'మళ్ళీ ఎవ్వడన్నా, ఎవడన్నా పలకలేకుండా వొట్టి చేతులు ఊపుకుంటూ బళ్ళోకొచ్చి కూర్చుంటే ప్రాణాలు తీసేస్తానని' భయపెట్టేశారు.

అందుకే, మారేశుగాడు పలక లేకుండా బడికె ళ్ళడానికి ససేమిరా అంటున్నది. అయితే, వాడి అయ్యకు వాడి గోడు పట్టడం లేదు.

ఏడుస్తున్న మారేశుగాడ్ని గొర్రెపిల్లను కబేళాకు లాక్కుపోతున్న కసాయిలా వాడిని బడి దగ్గరకు బలవంతంగా రెక్కపట్టుకొని లాక్కుపోతున్నాడు.

అప్పటికి పది నిమిషాలకు ముందే బడి తలు పులు తెరిపించి, నలుగురు పెద్దవాళ్ళైన బడిపిల్లల సాయంతో బడి గదిని శుభ్రం చేయిస్తున్న మాష్టా రికి మారేశు ఏడ్పు, వాడి అయ్య వీరంగం రెండూ వినిపించాయి.

గబగబా బడిలోంచి బయటకు వచ్చాడాయన. అప్పటికే మారేశుగాడు, వాడి అయ్య బడిదగ్గర కంటూ వచ్చేవారు.

"ఏంటయ్యా! కుర్రాణ్ణలా బాదుకుంటూ తీసు కొస్తున్నావేం?" కసురుకున్నారు మాష్టారు.

"ఈ కుర్నాకొడుక్కి మానావు పొగరు బలిసింది మాట్టారూ!... ఏలెడు లేడు ఎదవతొత్తుకొడుకు బడికెల్లాలంటే వకరాలు సేత్తన్నాడు..." మాష్టారి ముందే మరో రెండు చరువులు కొడుకు వీపు మీద వేస్తూ అన్నాడు.

"చాల్చాల్లే... ఇక్కడ కూడా కొడుతున్నావా?... ఆపవయ్యా... అవు... ఏరా! మారేశూ... రోజూ బడికి రావాలని నీకెన్నిసార్లు చెప్పాను. బుద్ధిగా బడికి రాకుండా ఇంటి దగ్గర కూర్చొని ఏం చేస్తా వురా?..." అడిగారు మాష్టారు.

మారేశుగాడు ఉలకలేదు... పలకలేదు. ఏడ్పు మాత్రం వదలకుండా.

"మాట్లాడవేంరా?..." వాడిదగ్గర్నుంచి సమా ధానం లేకపోవడంతో కోపంతో చెయ్యెత్తాడాయన కొడతానన్నట్టు.

భయంగా వెనక్కి జరిగాడు మారేశుగాడు.

"పలకనేదు మాట్టారూ... పలక నేకుండా వొత్తే తంతానని మీరన్నారు గందా... అందుకే మా అయ్యని కొత్త పలక కొనివ్వమంటే మొన్నే కదరా కొనిచ్చానంటూ తంతున్నాడు..." గబగబా చెప్పేసి, మళ్ళీ ఏడ్వడం మొదలుపెట్టాడు. చాలాసే పట్నుంచీ అదే పనిలో వున్నాడేమో ఎక్కిళ్ళు కూడా వస్తున్నాయి వాడికి.

"మారేశూ! ముందు ఆ ఏడ్పు ఆపరా! అవు నయ్యా... పలక లేకుండా నీ కొడుకు బడిలోకి వచ్చి ఏం చేస్తాడు చెప్పు.. నాలుగు అక్షరం ముక్కల్ని దిద్దడానికి వాడికి పలకంటూ ఉండాలి కదయ్యా... ఈ రోజుకు సరే, రేపయినా పలకకొనివ్వు. ఒరే మారేశూ! పలకలేదని నిన్ను కొట్టనుగానీ బడిలో కెళ్ళి కూర్చో."

మాష్టారి భరోసాకి ధైర్యం వచ్చింది మారేశుగా డికి. అప్పటి వరకూ వున్న వాడి ఏడ్పు కూడా చిత్రంగా మాయమైపోయింది. చొక్కా చెంగు లతో కళ్ళు తుడుచుకొని చెంగున దూకుతూ బడిలోకెళ్ళి వాడి చోట్లో కూర్చున్నాడు.

'పుత్తకాలూ, క్యాలర్‌సివ్వలూ, బట్టలూ ఇచ్చేటి గవుర్నమెంటోళ్ళు పిల్లకాయలకు పలకలెందుకు ఉసి తంగా ఇయ్యర్రో...' మారేశు అయ్య అక్కడ్నుంచి వెళ్ళిపోతూ చిన్నగా గొణుక్కున్నాడు.

అప్పటికే మారేశుగాడి వెనుకే బడిలోకి వచ్చేసిన మాష్టారికి మారేశుగాడి అయ్య గొణుగుడు విని పించలేదు. కుర్చీలో కూర్చొని అటెండెన్స్ రిజిష్టర్ చేతుల్లోకి తీసుకుంటూ మారేశుగాడివైపు చూశా రాయన.

నేల బల్లమీద కూర్చొని, అంతకు ముందు వాడి అయ్య కొట్టిన దెబ్బలు తన వంటి మీద తట్లు తేరి కనిపిస్తుంటే వాటిని తడుముకుంటున్నాడు వాడు.

అది చూస్తున్న మాష్టారి మనసు బాధతో మూల్గింది.

ఇక్కడ – బడిలోకి ఏకోపాధ్యాయునిగా ఆత నొచ్చి చేరిన ఈ మూడేళ్ళ కాలంలో పలక లేకుండా బడిలోకి వచ్చిన ఎందరో పిల్లల్ని దండించాడు. పాతశాల ప్రాంతంలో అందరూ రెక్కాడితే తప్ప డొక్కాడని వారే. ఇంటి దగ్గర వాళ్ళ పేద రికం గురించి, ఈతి బాధల గురించి తెలిసినా, పిల్లలు చదువుకోవాల్సిన వయస్సులో... అక్షరా లను దిద్ది వాటిని నేర్చుకోవాల్సిన సమయంలో వాళ్ళు పలకలు లేకుండా, వూరికే బడిలో కూర్చో వడాని కన్నట్టు వస్తున్నారనే అలా చేశాడు.

అతను ఆ పిల్లల్ని దండించడంలో, అలాదండిం చకపోతే వాళ్ళు ఎందుకూ కొరగాకుండా పోతా రేమోనన్న ఆందోళనతోపాటు, అందరికీ నాలుగు అక్షరాలు నేర్పి తన వృత్తికి అలా న్యాయం చేసు కోవాలన్న ఆలోచన కూడా వుంది.

అంతేకాదు. నేటి ఈ బాలల్ని, రేపటి భారత పౌరులుగా తీర్చిదిద్దాలనే బాధ్యతా వుంది!

మొత్తంగా ఆ బళ్ళో యాభై మంది వరకూ పిల్లలు వున్నారు. అందులో చదివే పిల్లలందరికీ పలకలు అవసరమే. అయితే ఆ పిల్లల్లో పలకలు వున్న వాళ్ళు బాగా తక్కువ. అందులో పగిలిన పలకలే ఎక్కువ.

ఒకటి, రెండు తరగతులు చదివే పిల్లలకు పలక ఒక్కటే విద్య నేర్చుకొనే సాధనం. విద్యాబోధనలో ఎన్ని కొత్త పద్ధతులు వొచ్చినా 'అ' నుండి గుణింతాల వరకు, అన్నీ పలక మీదే వాళ్ళ చేత దిద్దించాలి, వ్రాయించాలి. ఈ పిల్లల తల్లిదండ్రు లందరివీ వర్షాధార జీవితాలే. ప్రకృతి కనికరించి వర్షాలు పడితే తప్ప పనులుండవు. ఆ పనులు వున్నఊర్లో లేకపోతే, కూలి పనుల కోసం దూరా బారం వలసపోతుంటారు. పనులు పూర్తయ్యాక తిరిగిరావడం.

ఈ అవస్థలకు తోడు అధిక సంతానం. నారు పోసినవాడు నీరు పోయక మానడనే నమ్మకం ఇంకా వాళ్ళలో జీర్ణించుకొనే వుంది. పెద్దవాళ్ళ యిన పిల్లలు ఇంటి పనులు, పశువులను మేపడం చేస్తుంటే, చిన్నపిల్లలే బడిలోకి వస్తుంటారు. తల్లికి మళ్ళీ పిల్లలు పుడితే వాళ్ళ సేవలన్నీ చేసేది ఈ పిల్లలే. ఇంట్లో పనులు... తమకంటే చిన్నవాళ్ళ సేవలు... వీటి మధ్య ఎప్పుడో ఖాళీ దొరికినప్పుడే బడి. అలా వాళ్ళు బళ్ళోకొచ్చి కూర్చొనే నాలుగైదు గంటల్లో వాళ్ళ దగ్గర పలక కూడా లేకపోతే వాళ్ళు బడికొచ్చి పొందే ప్రయోజనం శూన్యమే.

అదే మాష్టారి మనసును కలవరపెడుతున్నది.

***

అప్పటికి మూడ్రోజులయ్యింది మారేశు బడికి వచ్చి.

'పలక లేకుండా బడికి వెళ్ళడం ఎందుకని గానీ మానేశాడా?' అదే విషయం మీద మిగిలిన పిల్లల్ని ప్రశ్నించారు మాష్టారు.

"ఆడికి జొరం మాట్టారూ! ఆ డయ్యా, అమ్మా, అంతా కూలి పని కోసం నిన్ననే వెల్లూరెళ్ళిపో యారు... ఇంటికాడ్న ఆడ్నొక్కణ్ణే ఇడిసిపెట్టే శారు..."

రెండో తరగతి చదువుతున్న కొండబాబు చెప్పాడు.

"ఇంట్లోవాళ్ళంతా ఊరెళ్ళిపోతే, మరి వాడికి తిండెవరు పెడుతున్నార్రా?..."

మారేశుగాడి పెద్దమ్మ ఇల్లు ఆళ్ళింటి పక్కనే నండి. అయినా... ఆడు జొరంతో మూడ్రోజు ల్నుంచీ వొన్నం తింటమే లేదు కదండీ..."

మాష్టారి మనసు కలుక్కుమంది. మారేశుకు జ్వరం అన్న విషయం తెలిశాక స్కూల్లో కూర్చొని పిల్లలకు పాఠం చెప్పబుద్ధేయలేదు. వాడి నొకసారి ఎలా వున్నాడో చూసి రావాలనిపించింది.

బడిని చూసే పనిని బళ్ళో అందరికంటే మోటుగా కనిపించే సురేష్ అనే ఐదో తరగతి కుర్రాడి కప్పగించి, కొండబాబును వెంటేసుకొని మారేశు ఇంటికి బయలుదేరాడాయన.

రెండు, మూడు సందులు తిరిగాక, "ఇదే మాట్టారూ! మారేశుగాడిల్లు" ఇంటివైపు చూపిస్తూ చెప్పాడు వాడు.

దేశంలోని దైన్యం అంతా గూడు కట్టినట్టుందా ఇల్లు.

మట్టితో కట్టిన నాలుగ్గోడల మీద వెదుర్లతో వేసిన పైకప్పు, దాని మీద తాటాకులున్నాయి. అవీ, ఏనాడు వేసినవో... ఎండకీ, వర్షానికీ తట్టుకొని, తట్టుకొని ప్రస్తుతం అవి సహజరూపం కోల్పోయి ముట్టుకుంటే చిదిగిపోయి పొడై రాలిపోయేట్టు వున్నాయి.

ఆ ఇంటి గోడలు పేడతో అలికి వున్నా, అక్కడక్కడా పెచ్చులూడిపోయి పేదవాడి దుస్తులకు కుట్టుకున్న మాసికల్లా కనిపిస్తున్నాయి.

కొండబాబుతోపాటు ఆ ఇంటి గుమ్మం దాటి లోపలకు నడిచారు మాస్టారు.

కుక్కిగా మారిన నులక మంచం మీద మూల్గుతూ పడున్నాడు మారేశు. నిద్రపోతున్న వాడిని లేపకుండా వాడి చేయి అందుకొని చూశాడాయన. జ్వరం తగ్గినట్టుగానే అనిపించింది. కానీ నీరసం వాణ్ణి వదలకపోవడం వల్ల చాలా బలహీనంగా వున్నాడు అనుకున్నారాయన.

మాష్టారిలో మునుపటి ఆందోళన ఇప్పుడు లేదు. 'జ్వరం రావడం వల్లనే మారేశు బడి మానేశాడు తప్ప, పలక లేకుండా వొస్తే తాను కొడతాడన్న భయం చేతకాదు.'

"రేపు ప్రొద్దుటో, సాయంత్రమో ఒకసారి వీడిని నాకు కనిపించమని చెప్పరా!" కొండబాబుతో చెప్పి, ఆ ఇంట్లోంచి బయటకు కదిలేందుకు వెనుదిరగబోతుండగా ఆయన దృష్టి మారేశు పడుకున్న మంచం వెనుకవైపు గోడ మీద పడింది.

ఆశ్చర్యంగా ఆయన కళ్ళు విచ్చుకున్నాయి.

ఆ గోడ మీద అక్షరాలు...

మసిబొగ్గుతో వచ్చీరానట్టు రాసిన నల్లని అక్షరాలు..

అ, ఆ, ఇ, ఈ ల నుండి అం. అః ల వరకూ...

అయ్య పలక కొనివ్వకుండా, కొనమంటే కొట్టి బాధపెడుతున్నా, పలక లేకుండా బడికొస్తే ప్రాణం తీస్తానని మాష్టారు భయపెడుతున్నా... మారేశు శ్రద్ధతో, బుద్ధిగా మసిబొగ్గుతో తను నేర్చుకున్న అక్షరాలను మరచిపోకుండా రోజూ గుర్తుకు తెచ్చుకొనేందుకురాసుకున్న అక్షరాలు పేడతో కలిగివ ఆ గోడ మీద అందమైన ఐరావతాల్లా కనిపిస్తున్నాయి...

అవి చూస్తున్న మాష్టారి హృదయం కరిగిన మంచులా అయ్యింది.

మారేశులో చదువు పట్ల వున్న దీక్ష... పట్టుదల ... ఆయన కనుల్ని చెమరింపచేసింది.

వీడు ఎదిగి పెద్దయ్యాక గోడల మీద ఎర్రరంగుతో నినాదాలే రాస్తాడో?! ... పెద్ద ఉద్యోగియై ఫైళ్ళ మీద పచ్చింకుతో సంతకాలే చేస్తాడో?!...

అసలు వీడి చేతిలో భవిష్యత్‌లో ఏ ఇంకు పెన్ను చేరేందుకైనా ముందు వీడిలో ప్రస్తుతం చదువుపై వున్న ఆసక్తి 'యింకి'పోకుండా చూడాల్సిన అవసరం వుంది.

ఇలాంటి మారేశులూ... మరొకళ్ళూ... ఈలాంటి పల్లెల్లో ఎందరు...ఎందరెందరు వున్నారో?...

వీళ్ళకున్న ఆసక్తి... ప్రతిభ... అన్నీ కేవలం పలకలు కొనలేని వాళ్ళ తల్లిదండ్రుల అశక్తత వల్ల నీరుకారిపోయే పరిస్థితి కలగడం ఎంత దారుణం?...

ఆ ఇంటి లోపల గోడమీద అక్షరాలు కలిగించిన గొప్ప అనుభూతితో అక్కడ్నుంచి బడివైపు నడిచారు మాష్టారు.

***

మర్నాడు -

బడిలో పలకా, బలపాలను పంచుతున్నారు మాష్టారు.

బళ్ళో చదివే వాళ్ళే కాదు... బడి వయస్సు రాని ఇళ్ళ దగ్గరి పిల్లలూ వాటి కోసం వచ్చి వరుసగా నిల్చున్నారు. అందులో జ్వరం తగ్గిన మారేశూ వున్నాడు. వాడి ముఖం తనందుకోబోతున్న పలక కలిగించిన ఉత్సాహంతో ప్రకాశవంతంగా వెలిగిపోతూంది.

పిల్లలందరూ తాము కొని తెచ్చి పంచుతున్న పలకా, బలపం ను పువ్వూ బెల్లాలంత ఆత్రంగా అందుకుంటుంటే మాష్టారి కళ్ళలోంచి ఆనందబాష్పాలు అక్షరాల్లా అందంగా మెరుస్తూ రాలుతున్నాయి.

## నియంత ఉరినవ్వు



సామ్రాజ్యవాద కాలుష్యానికి
స్వదేశాన్నప్పగించినవాడు
నైజీరియా నియంతైనా, 'ప్రజాస్వామ్య' ప్రధానైనా
ప్రవర్తనలో తేడా చూపడు
దక్షిణాఫ్రికాలో జాత్యహంకారాన్ని నిరసించి
పశ్చిమాఫ్రికాలో జాతి హంతకరూపాన్ని ప్రదర్శిస్తాడు!
ఐ.రా.స.లో అసమానత పోవాలని వాగేసి
ఇంట్లో అసమానతను ఇంకా, ఇంకా పోగేస్తాడు!
మారకద్రవ్య నిలువలు తప్ప వాడి కళ్ళకు
మనుషుల జీవితాల విలువలు కనిపించవు
జీవితాలే కనిపించని వాడికి
'జీవించే హక్కు కావా'లంటే చికాకే
అణచివేసే చేతిలో ఆయుధమైన పోలీసు
అక్కడైనా ఇక్కడైనా ఒక్కలాగే వుంటాడు
హింసను కోరే కళ్ళకు ఎదుటివాడిలో 'హింస' కనిపిస్తుంది
ఉరివేసి చంపినా, గురిచూసి కాల్చినా ఎలాగైనా ఒక్కటే
అందుకే అక్కడ
కెన్‌సారోవివా, అతని సహచరులూ వుంటే
ఇక్కడ
భూమయ్యా, కిష్టాగౌడ్‌లూ
డాక్టర్ రామనాథం, లాయర్ ప్రభాకర్‌రెడ్డి
ఇత్యాదులుంటారు
(అవును వాళ్ళుంటారు)

— రా

(నైజీరియా నియంతలు ఉరితీసిన మానవహక్కుల ఉద్యమకారులు కెన్‌సారోవివానూ అతని సహచరులనూ సంస్మరిస్తూ)